క్లుప్తంగా

భౌ..బోయ్..!



ఖాజానగర్‌లోని ఓ వీధిలో కుక్కలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముఖ్యంగా శాంతినగర్, ఖాజానగర్ ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. ఖాజానగర్ వాటర్ ట్యాంక్ వీధిలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులు, అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ద్విచక్రవాహనాలను వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై నగర పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

క్రీడాకారులకు అభినందన



ఇందుకూరుపేట: బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో అండర్ - 14, 17 విభాగాల్లో మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. ఈ క్రమంలో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్‌ను ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడారు. ఖోఖో, కబడ్డీ, పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్ తదితర క్రీడాంశాల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలవడాన్ని అభినందించారు.

ఘనంగా సీమంతం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకొని నగర పంచాయతీ పరిధిలోని ఖాజానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. వ్యక్తిగత శుభ్రత, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

మనుబోలు: మనుబోలు బీసీ కాలనీలో ఇటీవల వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న బాణసంచా పేలుళ్లలో బాధితులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి గురువారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఆయన బాధితులను పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన కంద్రాతి గిరీష్, శంకరయ్య, మోమిడి లోకేశ్, కావేటి పెంచలయ్యకు రూ.20 వేల చొప్పున అందజేశారు. మిగిలిన రూ.20 వేలను స్థానిక యువకులకు అందజేసి క్షతగాత్రులకు ఇవ్వాలని సూచించారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

కోవూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళలు నిరసనను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని గుమ్మళ్లదిబ్బ పరిధిలో ముస్లిం శ్మశాన వాటికకు సంబంధించిన స్థలాన్ని అధికారులు పరిశీలించారని, దీన్ని ఏర్పాటు చేస్తే తాము ఇబ్బందులు పడతామని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటరమణమ్మ, హరి, వాసు, విజయ, విమల, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిపై నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చిల్లకూరు మండలం గుమ్మలదిబ్బకు చెందిన ఏడుకొండలు, పావని (41) దంపతులు అల్లూరు మండలం ఇస్కపల్లిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి ఈ నెల 23న వెళ్లారు. తిరిగెళ్తుండగా, భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన పావని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఏడుకొండలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దోపిడీకి అడ్డుకట్ట పడేనా?

వెంకటాచలం మండలం కసుమూరులో మస్తానవలీ దర్గా.. ఇది దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ భక్తులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఏటా గంధ మహోత్సవాల సందర్భంలో దర్గా ప్రాంగణంలో అదనపు హుండీలు ఏర్పాటు చేసి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన వక్ఫ్ బోర్డు అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కసుమూరు దర్గా గంధ మహోత్సవాల్లో అదనపు హుండీలు
- ఏటా భక్తుల వద్ద బలవంతపు వసూళ్లు
- ప్రశ్నిస్తే దాడులు.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- రేపట్నుంచి గంధోత్సవం



దర్గాలో ఏర్పాటు చేసిన హుండీలు

వెంకటాచలం: కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు ఎంతో చరిత్ర ఉంది. 247వ గంధ మహోత్సవాలు ఈనెల 28 నుంచి 31 తేదీ వరకు నిర్వహించనున్నారు. వీటికి తెలుగు రాష్ట్రాలతోపాటుగా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర చోట్ల నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.

ఇలా..

వక్ఫ్ బోర్డు అధికారులు వేలం పాట నిర్వహించి పాడుకున్న హుండీల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. కొన్నేళ్లుగా హుండీలను దక్కించుకుంటున్న నిర్వాహకులు వక్ఫ్‌బోర్డు అధికారులు, దర్గా ముజావర్లతో కుమ్మక్కై భక్తుల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలున్నాయి. హుండీ వేలం గతంలో రూ.లక్షల్లో ఉండేది. నేడు దానిని పోటీపడి మరీ రూ.కోట్లలో దక్కించుకుంటున్నారంటే ఏ స్థాయిలో వసూలు చేస్తారో అర్థం చేసుకోవచ్చు.

పక్కదారి పట్టించారా..?

ఈ ఏడాది మే నెల 27 తేదీ నుంచి దర్గా హుండీ వేలం పాట నిర్వహించలేదు. వాటి నిర్వహణ వక్ఫ్‌బోర్డు అధికారుల పర్యవేక్షణలోనే ఉంది. ఆ తేదీ నుంచి ఆగస్ట్ 26 తేదీ వరకు హుండీల్లో వచ్చిన నగదును వక్ఫ్‌బోర్డు అధికారులు లెక్కించి రూ.29.43 లక్షలు ఉన్నట్లు లెక్కలు చూపారు. వాస్తవానికి హుండీల్లో వచ్చిన నగదు రూ.34 లక్షల పైమాటేనని ప్రచారం జరుగుతోంది. వక్ఫ్ బోర్డు అధికారులు, కొందరు ముజావర్లతో చేతులు కలిపి భక్తుల నుంచి బలవంతంగా వసూలు చేసిన నగదును దుర్వినియోగం చేశారని ఆరోపణలున్నాయి. హుండీ లెక్కింపు సమయంలో వక్ఫ్‌బోర్డు అధికారుల సమక్షంలోనే కొంత నగదును పక్కదారి పట్టించినా స్పందించలేదనే విమర్శలున్నాయి.

ఏం చేస్తారో..

కసుమూరు దర్గాలో ఏటా అదనపు హుండీలు పెట్టి వసూళ్లు చేయడం వివాదాస్పదంగా మారింది. నిబంధనలు ప్రకారం ఉత్సవాల సందర్భంగా రెండు హుండీలు మాత్రమే ఉండాలి. కానీ దర్గా లోపలికెళ్లే మార్గంలో అదనంగా హుండీలు ఏర్పాటు చేసి భక్తుల చేత డబ్బులు వేయిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, కొందరు ముజావర్లు జోక్యం చేసుకుని కేసులు నమోదు చేయకుండా చక్రం తిప్పుతున్నారు. వక్ఫ్‌బోర్డు, పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముంది.



కసుమూరు దర్గా ముఖద్వారం

చర్యలు తీసుకుంటాం

కసుమూరు దర్గాలో భక్తుల నుంచి అదనంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం. హుండీ నగదు లెక్కింపు సమయంలో దుర్వినియోగమైందని కొందరు దుష్ప్రచారం చేశారు. 247వ గంధ మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతాం.

– ఖుదావస్, వక్ఫ్ బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్

పిల్లల ఎదుగుదలను విధిగా పరిశీలించాలి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా ఎనిమిదిలోపు విధిగా పరిశీలించాలని కోవూరు సీడీపీఓ జ్యోతి ఆదేశించారు. మండలంలోని నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం సెక్టార్ల పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలకు కోవూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల ఎదుగుదలకు కేంద్రాల్లో అధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలను రోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు నిర్వహించాలని కోరారు. కార్యకర్త, సహాయకురాలు రోజూ తొమ్మిది గంటలకు కేంద్రంలో ఉండాలని చెప్పారు. సూపర్‌వైజర్లు నిర్మల, నాగభూషణమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్యోతి

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

మనుబోలు: మండలంలో పక్కాగృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ పథకాల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష జరిపారు. సచివాలయాల వారీగా ఇళ్లు ఏ దశల్లో ఉన్నాయో వివరాలడిగి తెలుసుకున్నారు. 260 ఇళ్లను డిసెంబర్ ఆఖరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 594 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని గుర్తు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ రవికుమార్ తదితరులున్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సుబ్బారెడ్డి

ప్రధానోపాధ్యాయులతో సమావేశం

కొడవలూరు: పాఠశాలల్లో నిర్దేశించిన కార్యక్రమాలను తప్పక అమలు చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని డిప్యూటీ డీఈఓ రఘురామయ్య ఆదేశించారు. మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర – 2047లో భాగంగా పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలను విధిగా అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఉదయం తొమ్మిది గంటల్లోపు హాజరును నమోదు చేసేలా చూడాలని కోరారు. విద్యార్థుల హాజరును నమోదు చేసి మధ్యాహ్న భోజన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని వివరించారు. యూడైస్‌కు సంబంధించిన డేటాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు గురువారం సాయంత్రానికే పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ వసంతకుమారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వర్ణలత, డేటా ఎంట్రీ ఆపరేటర్ విజయమ్మ, సీఆర్‌ఎంటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పొదలకూరు: గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ



టీపీగూడూరు: కోవెరపాళెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పొదలకూరు: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ప్రతినెలా 10వ తేదీన అంగన్‌వాడీ సెంటర్లలో వారి ఎత్తు, బరువు పరిశీలించుకోవాల్సిందిగా సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని దుగ్గుంటరాజుపాళెం కేంద్రంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం అబుబకర్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం

తోటపల్లిగూడూరు: పౌష్టికాహారంతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం కోవెరపాళెం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త గిరిజ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం స్టాటిస్టిక్స్, కామర్స్, ఇంటిగ్రేటెడ్ బయో టెక్నాలజీ విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. దీనికి వీసీ ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. చదువుకోవడం వల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా ఆలోచనా విధానం మారుతుందన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ వి.సురేష్‌బాబు విద్యార్థులు సూచనలు, సలహాలిచ్చారు. ఆయన్ను వీసీ సన్మానించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సి.హెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌బాబును సన్మానిస్తున్న ఇన్‌చార్జి వీసీ

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేశారని తెలిస్తే వారిపై పీసీ, పీఎన్డీటీ చట్టం మేరకు కేసులు నమోదు చేస్తామని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ స్పష్టం చేశారు. నగరంలోని కేఎం, ఇమేజ్, మాగ్నెంట్ స్కాన్ సెంటర్లు, రిచ్, రత్నసాయి ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలను వైద్యశాఖ మాస్ మీడియా అధికారి కనకరత్నంతో కలిసి గురువారం చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు నిర్వహిస్తున్న స్కానింగ్ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ధరల పట్టికను స్కానింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించాలని కోరారు. క్షయ విభాగ జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘించి నిర్మిస్తే చర్యలు

నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం నిర్దేశించిన అనుమతులు, నిబంధనలను ఉల్లఘించి చేపడుతున్న కట్టడాలను నిర్మాణ స్థాయిలోనే నిలిపేయాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మాగుంట లేఅవుట్, ముత్యాలపాళెం తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. స్థానికంగా ఓ భవన నిర్మాణ అనుమతులను పరిశీలించారు. అనుమతుల మేరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయాననే అంశాన్ని ఆరాతీసి, సిబ్బందితో కొలతలేయించారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడారు. అనుమతుల మేరకే నిర్మాణాలు జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లఘించిన వారి వివరాలను కార్యాలయంలో అందజేసి, నోటీసులను జారీ చేయాలని సూచించారు. ముత్యాలపాళెంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి తాగునీటి నాణ్యతను తనిఖీ చేశారు. మాగుంట లేఅవుట్లో కృష్ణపట్నం పోర్టు నిర్వహణలోని పార్కును సందర్శించి వసతులను పరిశీలించారు. పార్కు పరిసరాల్లో పారిశుధ్య పనులను రోజూ చేపట్టాలని చెప్పారు.



భవన కొలతలను పరిశీలిస్తున్న సూర్యతేజ

కాకాణిని కలిసిన పార్టీ నాయకులు

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండలంలోని చెర్లోపల్లి గ్రామ నాయకులు గురువారం నెల్లూరులో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కాకాణిని శాలువతో సన్మానించారు.

తోటపల్లిగూడూరు: మేజర్ పంచాయతీ కోడూరు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు కావల్‌రెడ్డి రవీంద్రరెడ్డి, కావల్‌రెడ్డి హరిశ్చంద్రారెడ్డి, మారంరెడ్డి బుజ్జిరెడ్డి, వేణురెడ్డి తదితరులు నెల్లూరులో గురువారం కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అలాగే మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో సౌత్ఆములూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇంకా మాచర్లవారిపాళెం సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, స్థానిక నేతలు కాకాణిని సత్కరించారు.

- **మనుబోలు:** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో మనుబోలు మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం నెల్లూరులో ఆయన్ను కలిశారు. ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మజుంధర్, నాగమణి తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

ముత్తుకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గురువారం ముత్తుకూరు మండలానికి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. పోలంరాజుగుంట, పంటపాళెం, నేలటూరు, బ్రహ్మదేవి, పొట్టెంపాడు గ్రామాలకు చెందిన నాయకులు నెల్లూరులో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



ముత్తుకూరు: అభినందిస్తున్న నేలటూరు నేతలు



టీపీగూడూరు: మాజీ మంత్రితో కోడూరు నేతలు



గోవర్ధన్‌రెడ్డితో మనుబోలు నాయకులు




పొదలకూరు: కాకాణితో నాయకులు

అక్రమంగా మట్టి తవ్వకాలు

విడవలూరు: మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద ఈస్టన్ చానల్ కరకట్టలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం తెల్లవారుజామున వెలుగు చూసింది. జేసీబీలతో కాలువలను తవ్వి మట్టిని అక్రమంగా తరలించారు. ఇంత జరుగుతున్నా, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి



కొడవలూరు: దేహ, అవయవ, రక్తదానాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ విజయ కోరారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. వీటిపై అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని వివరించారు. అనంతరం దేహ సమర్పణకు అంగీకార పత్రాన్ని హైస్కూల్ టీచర్ నరేంద్ర రాసివ్వగా, ఆయన్ను సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు, డీకే మహిళా కళాశాల అధ్యాపకురాలు భారతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు: స్వచ్ఛత హీ సేవలో ప్రజలు భాగస్వాములు కావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు గురువారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమె మాట్లాడారు. ఈ క్యాంపును అక్టోబర్ రెండు వరకు నిర్వహించనున్నామని వివరించారు. కేన్సర్ పరీక్షల కోసం ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇక్కడే మొబైల్ వ్యాన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మెరుగైన చికిత్స అవసరమైతే తిరుపతిలోని కేన్సర్ హాస్పిటల్‌కు పంపనున్నామని వెల్లడించారు. పారిశుధ్య కార్మికులను అక్టోబర్ రెండున సత్కరించనున్నామన్నారు. మెడికల్ క్యాంప్ నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. డీపీఓ సుస్మితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కృష్ణయ్య సంస్మరణ సభకు హాజరైన కాకాణి

వెంకటాచలం: మండలంలోని పాలిచెర్లపాడు తమిళకాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కన్నం కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామంలో గురువారం జరిగిన సంస్మరణ సభకు మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి హాజరయ్యారు. కృష్ణయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు.



బాబా మందిరంలో విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పల్లకి సేవ జరిగింది. శేజ్ హారతితో పూజాకార్యక్రమాలు ముగిశాయి.